క్లుప్తంగా

విద్యార్థులు శ్రద్ధతో చదవాలి



మాక్లూర్: విద్యార్థులు శ్రద్ధతో చదువుకోవాలని, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని జెడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ఉచిత పాఠ్యపుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. ఎంపీడీవో క్రాంతి, పాఠశాల ప్రత్యేకాధికారి సీహెచ్ ప్రగతి, ఎంపీటీసీ వెంకటేశ్వర్‌రావు, రాజేందర్‌లు పాల్గొన్నారు.

క్షయవ్యాధి టీకాలపై అవగాహన



మాక్లూర్: మండలంలోని కల్లెడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయవ్యాధి టీకాలపై ఏఎన్ఎం, ఆశవర్కర్లకు మంగళవారం వైద్యుడు సంతోష్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆశ వర్కర్లు గ్రామాల్లో సర్వే నిర్వహిస్తూ టీకా పొందుటకు అర్హులు ఎవరనేది గుర్తించాలన్నారు. క్షయవ్యాధి నిర్మూలనే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. వైద్యులు ప్రకాష్‌కుమార్, రవిగౌడ్, లావణ్య, ప్రవీణ్‌రెడ్డి, శశిభూషన్, లక్ష్మి, ప్రసాద్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

నేడు శివాజీ విగ్రహావిష్కరణ



రెంజల్(బోధన్): మండలకేంద్రంలో బుధవారం ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు శివాజీ ఉత్సవ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. హిందూ సామ్రాజ్య దినోత్సవం సందర్భంగా శివాజీ విగ్రహావిష్కరణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్లారం లింగేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకు పిట్లక్రిష్ణ మహారాజ్, వక్తగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఇందూర్ విభాగ్ ప్రచారక్ నర్రా వెంకట శివకుమార్‌జీ పాల్గొంటారన్నారు.

వాహనాల తనిఖీ



భీమ్‌గల్: మండలకేంద్రంలో మంగళవారం ఆర్మూర్ డివిజన్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వివేకనందరెడ్డి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. భీమ్గల్, కమ్మర్‌పల్లి ఎస్సైలు హరిబాబు, రాజశేఖర్ పర్యవేక్షణలో సిబ్బంది వాహనాలను ఆపి తనిఖీలు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధలను పాటించాలన్నారు. నిబందనలకు విరుద్ధంగా ఉన్న వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు.

స్కూల్ యూనిఫామ్స్ పంపిణీ



కమ్మర్‌పల్లి: మండలంలోని చౌట్‌పల్లి బాలికల ప్రాథమికోన్నత పాఠశాల మంగళవారం విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన స్కూల్ యూనిఫామ్స్‌ను ఉపాధ్యాయులు పంపిణీ చేశారు. ఎంఈవో ఆంధ్రయ్య, రమా, మధురిమ, హెచ్‌ఎం తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్‌ల అప్పగింత



వర్ని: మండలంలోని శంకోరా, సత్యనారాయణపురం గ్రామాలకు చెందిన తరుణ్, సునీల్ కొన్ని నెలల క్రితం వారి ఫోన్లను పోగొట్టుకున్నారు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోలీసులు రికవరీ చేసి మంగళవారం అందజేశారు. ఎస్సై కృష్ణకుమార్ ఉన్నారు.

ప్రభుత్వ బడిలో చేరిక



బాల్కొండ: మెండోరా మండలం బుస్సాపూర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివిన చిన్నారులను మంగళవారం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అంగన్‌వాడీ టీచర్లు చేర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రమేశ్ మాట్లాడుతూ.. అంగన్‌వాడి కేంద్రాల్లో చదివే ప్రతి చిన్నారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పనులు పూర్తయ్యేదెప్పుడో?

- ఆర్మూర్ బస్టాండ్‌లో రెండు నెలలుగా సాగుతున్న డ్రెయినేజీ, కల్వర్టు నిర్మాణం
- ఇబ్బందుల్లో ప్రయాణికులు



ఆర్మూర్ బస్టాండ్ వద్ద కొనసాగుతున్న డ్రెయినేజీ, కల్వర్టుల పనులు

ఆర్మూర్‌టౌన్: పట్టణ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులు నెలల పాటు కొనసాగడంతో ప్రజలకు ఇబ్బందిగా మారుతున్నాయి. గత కొన్నాళ్లుగా ఆర్మూర్ బస్టాండ్ ప్రాంతంలో మురుగునీటి సమస్య తీవ్ర ఇబ్బందిగా మారింది. సమస్య పరిష్కారం కోసం అధికారులు ఎన్నికల ముందు సుమారు రూ. 16లక్షల అంచనా వ్యయంతో బస్టాండ్ ప్రాంతంలో మురికికాలువ, కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభించారు. సుమారు రెండు నెలలు కావస్తున్నప్పటికీ ఇంకా పనులు పూర్తికాకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు నుంచే బస్సులు రాకపోకలు సాగించడంతో డ్రైవర్లు ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. రెండు రోజుల క్రితం బస్సు వెనుకకు తీసే క్రమంలో ఓ మహిళ కాళ్లపై నుంచి టైర్లు వెళ్లడంతో కాళ్లు నుజ్జునుజ్జై తీవ్ర గాయాల పాలైంది. అదే సమయంలో ప్రైవేటు వాహనాలు సైతం బస్టాండ్ లోపలికి రావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు వాపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రారంభించడంతో తీవ్రమైన రద్దీ ఏర్పడింది. బస్టాండ్‌లో మహిళలు, యువతులు వివిధ పనుల నిమిత్తం రావటంతో కిక్కిరిసిపోతుంది. అలాగే బస్సుల్లో పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కడం, మరోవైపు మురికి కాలువ నిర్మాణ పనులు నెమ్మదిగా సాగడంతో బస్టాండ్‌లో తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే నిర్మాణ పనులు పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలో పనులు పూర్తిచేస్తాం..



ఆర్మూర్ బస్టాండ్ ప్రాంతంలో చేపడుతున్న మురికికాలువ, కల్వర్టు పనులు త్వరగా పూర్తిచేస్తాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. కాంట్రాక్టర్‌కు త్వరగా పనులు పూర్తిచేయాలని సూచించాం.

–ఏ.రాజు, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

కమ్మర్‌పల్లిలో ఉపాధిహామీ ప్రజావేదిక



పనుల వివరాలను చదివి వినిపిస్తున్న డీఆర్పీలు

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. డీఆర్పీలు గత వారం రోజులుగా మండలంలోని ఆయా గ్రామాల్లో 2023 సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు రూ. 3.16 కోట్ల వ్యయంతో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై తనిఖీ చేపట్టారు. సామాజిక తనిఖీలో వెలుగు చూసిన అక్రమాలను ప్రజా వేదికలో వెల్లడించారు. పనులకు సంబంధించి వ్యయం, ఖర్చులను చదివి వినిపించారు. మస్టర్ రోల్ చెల్లింపుల్లో జరిగిన పొరపాట్లను గుర్తించారు. ఈ పొరపాట్లపై ఎఫ్ఏ, జీపీ కార్యదర్శులకు రూ. 61వేలు జరిమానా రాశారు. డీఆర్‌డీవో సాయాగౌడ్, డీవీవో నారాయణ, అంబుడ్స్‌మెన్ శ్రీనివాస్, ఎంపీడీవో రాజశ్రీనివాస్, తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీపీ గౌతమి, ఏపీవో విద్యానంద్, ఎంపీవో సదాశివ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుని మృతిపై సంతాపం

రెంజల్: ఉపాధ్యాయుని మృతిపై పీఆర్టీయూ రెంజల్ మండల శాఖ ఆధ్వర్యంలో సంతాపం తెలిపారు. మండలంలోని బోర్గాం ప్రభుత్వ పాఠశాలలో పదేళ్లుగా విధులు నిర్వహిస్తున్న గంగాధర్ అనే ఉపాధ్యాయుడు క్యాన్సర్ వ్యాధితో సోమవారం రాత్రి మృతి చెందినట్లు పీఆర్టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమలింగంగౌడ్, సాయారెడ్డి పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

ఫిట్‌నెస్ లేని బస్సులపై చర్యలు తీసుకోవాలి



ఆర్మూర్‌టౌన్: ప్రైవేట్ పాఠశాలల బస్సులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఫిట్‌నెస్ లేకుండా నడుస్తున్న వాటిపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో ఉన్న ఎంవీఐ కార్యాలయంలో మంగళవారం ఎంవీఐ వివేకానంద్‌రెడ్డికి ఫిట్‌నెస్ లేని బస్సులపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. బస్సుల్లో పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్నారని, దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్, అనిల్, నిఖిల్, మమత తదితరులు పాల్గొన్నారు.

పోచారంను కాంగ్రెస్‌లోకి రానివ్వం



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

రుద్రూర్: ద్వితీయ శ్రేణి నాయకులను ఎదగనీయకుండా అడ్డుకున్న మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీలోకి రానివ్వమని పోతంగల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ పుప్పాల శంకర్ అన్నారు. పోతంగల్ మండలం చెక్‌పోస్ట్ వద్ద మంగళవారం ఆయన, కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోచారం అధికారంలో ఉన్న పార్టీలోనే ఉండి, అధికారాన్ని అనుభవించడం అలవాటుగా మారిందని విమర్శించారు. కాంగ్రెస్ కార్యకర్తలను ఎన్నో ఇబ్బందులు పెట్టిన ఆయనను పార్టీలోకి రానివ్వమన్నారు. నాయకులు గంధపు పవన్ కుమార్, కల్లూరి రామిరెడ్డి, కేశ వీరేశం, హన్మంతు, పుల్కంటి సాయిలు, మన్సూర్ ల్గొన్నారు.

కోటగిరిలో కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి రావడానికి ప్రయత్నించడాన్ని వ్యతిరేకిస్తున్నామని అన్నారు. పోచారం కాంగ్రెస్ పార్టీలోకి వచ్చే ఉద్దేశం లేనట్టయితే పత్రికల్లో వస్తున్న వార్తలను ఖండించాలని డిమాండ్ చేశారు. వహీద్, ఖాదర్, నజీర్, అయూబ్ ఉన్నారు.

రిజిష్టర్లను సక్రమంగా నిర్వహించాలి



రుద్రూర్: ఉపాధి హామీ రిజిష్టర్లను సక్రమంగా నిర్వహించాలని మండల అభివృద్ధి అధికారి సురేశ్ బాబు ఆదేశించారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఉపాధి హామీకి సంబంధించి ఏడు, నర్సరీ రిజిష్టర్లను అప్‌డేట్ చేయాలన్నారు. హార్టికల్చర్, ఫాంపండ్స్ కోసం స్థల సేకరణ చేయాలని సూచించారు. సమావేశంలో మండల పంచాయతీ అధికారి సాయిలు, ఉపాధి హామీ ఏపీవో మనోహర్, టెక్నికల్ అసిస్టెంట్ ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్‌లు పాల్గొన్నారు.

అసంపూర్తిగా సమీకృత మార్కెట్ నిర్మాణం



బోధన్‌లో పిల్లర్ల దశలోనే ఉన్న సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని శక్కర్ నగర్ కాలనీలో చేపట్టిన సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మార్కెట్ నిర్మాణం కోసం జీవో 65ద్వారా ప్రత్యేక నిధులు రూ. 7.20 కోట్లు మంజూరయ్యాయి. గత జనవరిలో నిర్మాణ పనులను ప్రారంభించారు. పనులు ప్రారంభించి యేడాది పూర్తయినా పనులు మాత్రం పిల్లర్ల వరకే అయ్యాయి. కేవలం రూ. 2 కోట్ల వరకు మాత్రమే పనుల అయ్యాయి. నిధులున్నా, పనులు ఆలస్యం కావడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా బల్దియా అధికారులు స్పందించి సమీకృత మార్కెట్ నిర్మాణ పనులపై ప్రత్యేక దృష్టి సారించి, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

జీజీహెచ్‌లో కార్పొరేట్‌కు దీటుగా వైద్యసేవలు

నిజామాబాద్‌నాగారం: నగరంలోని జీజీహెచ్‌లో కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రులకు దీటుగా వివిధ రకాల వైద్యసేవలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిమరాజ్ అన్నారు. జీజీహెచ్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆస్పత్రిలో ఇటీవల న్యూరో సర్జరీ సేవలు ప్రారంభించామని, ప్రస్తుతం సూపర్ స్పెషాలిటీ సేవలలో భాగంగా యూరోలజీ సేవలను అందిస్తున్నమన్నారు. యూరోలజీ విభాగానికి చెందిన డా.శబరినాథ్ ఆధ్వర్యంలో శస్త్రచికిత్సలను విజయవంతం చేయడం చాలా సంతోషమన్నారు. జిల్లాలో ఎవరైనా మూత్రాశయంలో రాళ్లతో బాధపడుతున్నట్లయితే జీజీహెచ్‌కు సంప్రదించాలన్నారు.

యోగా మన జీవనశైలిలో భాగం కావాలి



నగరంలో యోగా చేస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్: యోగా, ధ్యానం మన జీవనశైలిలో ఒక భాగం కావాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని, వాసవి క్లబ్ సీనియర్ సిటిజన్స్, వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని తిలక్ గార్డెన్స్‌లో యోగా శిక్షణా తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. తనువు, మనస్సు, ఆత్మను ఏకం చేసే ఒకే సాధనం యోగా అన్నారు. వ్యాయామ సాధనల సమాహారాల ఆధ్యాత్మిక రూపమన్నారు.యోగా, ధాన్యమనే ఆధ్యాత్మిక సాధన మానసిక ఆరోగ్యానికి ఎంతగానో తోడ్పడుతుందన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జూన్ 21ని ఇంటర్నేషనల్ యోగాడేగా జరుపుకునే విధంగా 177 దేశాలు ఐక్యరాజ్యసమితిలో అంగీకారం తెలిపాయన్నారు. చిన్నప్పటి నుంచే యోగా సాధన చేసేలా పిల్లలను ప్రోత్సహించాలని, తద్వారా మానసికంగా, శారీరకంగా ధృడత్వంతోపాటు ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడిపే ఆస్కారం ఉంటుందని తెలిపారు. ఉచిత యోగా కేంద్రాలను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. బ్రహ్మానంద సరస్వతీ, క్లబ్ ప్రతినిధులు చైతుకుల భూమయ్య, ధీకొండ దేవేందర్, చిన్న రవీందర్, బీజేపీ నాయకులు ఆనంద్, పవన్ ముందాడ, కార్తీక్, నాయకులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఖలీల్‌వాడి: నగరంలోని ప్రగతినగర్ లోగల టాక్స్ బార్ అసోసియేషన్ భవనంలో మంగళవారం జిల్లా టాక్స్‌బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఇంగు రాజేశ్వర్, కార్యదర్శిగా వేములపాటి రవీంద్ర, కోశాధికారిగా ఎస్ఎస్ ఫణి చక్రవర్తి ఎన్నికయ్యారు. గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులుగా వెంకట రమణ, శైలేష్ కుమార్, బాగుల శ్రీనివాస్, గురుప్రసాద్, ప్రసన్న, మహేష్ జాజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణాలో హైదరాబాద్ తరువాత నిజామాబాద్ జిల్లాలోనే అసోసియేషన్‌కు సొంత భవనం నిర్మించుకున్నామని, ప్రస్తుతం 70 మంది సభ్యులతో అసోసియేషన్ కొనసాగుతుందన్నారు. త్వరలో మిగతా సభ్యులను కూడ చేర్చుకొని సంఘాన్ని బలోపేతం చేస్తామని తెలిపారు.

పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేయాలి



డొంకేశ్వర్‌లో మాట్లాడుతున్న అధికారులు



బోధన్‌లో ఆర్డీవోతో మాట్లాడుతున్న అధికారులు

డొంకేశ్వర్(ఆర్మూర్): 1నుంచి 19 ఏళ్లలోపు పిల్లల్లో నులి పురుగుల నివారణ కోసం అల్బెండజోల్ మాత్రలు వేయాలని మెడికల్ ఆఫీసర్ సంతోష్ ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లకు సూచించారు. డొంకేశ్వర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ నెల 20న జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా మాత్రలను పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు వేయాలన్నారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రతపై వారిపై అవగాహన కల్పించాలని సూచించారు. అదే విధంగా క్షయ వ్యాధిని నిర్మూలించేందుకు పెద్దలకు బీసీజీ టీకా వేసేందుకు సన్నద్ధం కావాలని వైద్యఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. హెల్త్ సూపర్‌వైజర్లు సురేందర్, ప్రమీల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ ఉన్నారు.

రుద్రూర్: మండలంలోని పోతంగల్‌లో మంగళవారం కోటగిరి ఉమ్మడి మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 20న 1–19 సంవత్సరాల పిల్లలకు అంగన్‌వాడీ, పాఠశాలలు, కళాశాలల్లో అల్బెండజోల్ మాత్రలు వేస్తారని, తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా విద్యా సంస్థలకు పంపించాలని ఆయన కోరారు. రానివారికి ఆరోగ్య ఉప కేంద్రాలో మాత్రలు వేస్తారని వివరించారు. కోటగిరి మండల కేంద్రంలో నేడు నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

బోధన్‌టౌన్(బోధన్): నులిపురుగుల నివారణకు 1నుంచి 19 సంవత్సరాల పిల్లలు అల్బెన్‌డజోల్ మాత్రలను తప్పనిసరిగా వేసుకోవాలని ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్ అన్నారు. పట్టణంలోని ఆర్డీవోను, మున్సిపల్ చైర్ పర్సన్‌ను మంగళవారండిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య, సమంత కలిశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడారు. బోధన్ డివిజన్‌లో 1 నుంచి 19 ఏళ్ల పిల్లలు 96,263 మంది ఉన్నారన్నారు. వీరందరికీ ఈనెల 20న మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని ఆర్డీవో సూచించారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య



అడ్మిషన్లు స్వీకరిస్తున్న అధ్యాపకులు

ఆర్మూర్‌టౌన్: ప్రభుత్వ కళాశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని కళాశాల ప్రిన్సిపాల్ నర్సయ్య అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అన్ని గ్రూపుల్లో అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కళాశాలలో మంగళవారం విద్యార్థుల నుంచి అడ్మిషన్లను స్వీకరించారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాల్లో అనుభవం కలిగిన అధ్యాపకులచే విద్యాబోధన జరుగుతోందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలబాలికలకు వేర్వేరుగా హాస్టల్ వసతి, ఉచిత నోట్ పుస్తకాలు, ఎన్ఎస్ఎస్, ఉచిత బస్‌పాస్ సౌకర్యం ఉందన్నారు. పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో చేరాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు స్వర్ణ, రవి, సుభాష్, చంద్రశేఖర్, నరేశ్, చంద్రమోహన్, లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

వైభవంగా కల్యాణోత్సవం



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందాంబ కల్యాణ్యాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు. భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నృసింహస్వామికి ఎమ్మెల్యే పూజలు



భీమ్‌గల్: మండలంలోని లింబాద్రిగుట్టను మంగళవారం ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి సందర్శించారు. ఈసందర్భంగా ఆలయంలోని లక్ష్మీనృసింహస్వామికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయ ధర్మకర్త నంబి లింబాద్రి ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ చరిత్రను ఎమ్మెల్యేకు వివరించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బద్దం నర్సారెడ్డి వర్ధంతి



నివాళులు అర్పిస్తున్న నాయకులు

మోర్తాడ్: మండలకేంద్రంలో మంగళవారం వ్యవసాయదారుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బద్దం నర్సారెడ్డి 20వ వర్ధంతి నిర్వహించారు. సంఘ గౌరవ అధ్యక్షురాలు సునీతారెడ్డి, నర్సారెడ్డి కూతురు సరితారెడ్డి, సంఘం ప్రతినిధులు పాల్గొని, నర్సారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు.

దరఖాస్తుల వెల్లువ



మోపాల్: ప్రజాపాలన సైట్ ఓపెన్ కావడంతో మండల పరిషత్ కార్యాలయం దరఖాస్తుదారులతో మంగళవారం నిండిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా గ్యాస్ సబ్సిడీ, విద్యుత్ జీరో బిల్లు పథకాలు అమలు చేస్తోంది. కానీ కొందరికే లబ్ధిచేకూరడంతో చాలామంది దరఖాస్తు చేయడం కోసం ఎదురుచూశారు. ఎన్నికల కోడ్ కారణంగా రెండు నెలలపాటు ప్రజాపాలన సైట్‌ను ప్రభుత్వం మూసేసింది. ప్రస్తుతం కోడ్ ముగిసి సైట్ ఓపెన్ కావడంతో దరఖాస్తుదారులు మండల పరిషత్ కార్యాలయానికి క్యూ కడుతున్నారు. భారీ సంఖ్యలో ప్రభుత్వ పథకాల కోసం దరఖాస్తులు చేస్తున్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	మహారాజా (తెలుగు) - 12.45, 6.40, 9.45 మ్యాజిక్ షాప్ మూర్తి (తెలుగు) 3.50
స్క్రీన్-2 –	హరోం హర (తెలుగు) - 12.15, 3.30, 6.45, 10.00
స్క్రీన్-3 –	మనమే (తెలుగు) - 11.45, 3.00, 6.15, 9.30
స్క్రీన్-4 –	చందు చాంపియన్ (హిందీ) - 12.10, 6.05, 9.15, నీ దారే నీ కథ (తెలుగు) - 3.20